# మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీపై ఉమ్మడి పోరు

## చట్టాలు కఠినంగా అమలు, విభాగాల సమన్వయం కీలకం

### మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీని పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన మానవ అక్రమ రవాణా వెట్టిచాకిరీ నిర్మూలన రాష్ట్ర స్థాయి సమన్వయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రివెన్షన్, ప్రొటెక్షన్, ప్రాసిక్యూషన్ అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు వెళ్లాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించడం ద్వారా వలసలను, అక్రమ రవాణాను అడ్డుకోవచ్చన్నారు. ఈ నేరాలను అరికట్టడంలో విఫలమైతే మనం కూడా ఆ సమస్యలో భాగస్వాములమేనని, అందరూ సమిష్టి బాధ్యతగా పని చేయాలని స్పష్టం చేశారు. ప్రజలను చైతన్యం చేస్తూ వెట్టిచాకిరి కార్మికవిధానం లాంటి దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందనీ కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. 30, 40 ఏళ్ల క్రితం రంగారెడ్డి జిల్లాలోనే అనేక వెట్టికార్మిక కేసులు నేను ప్రత్యక్షంగా చూశాననీ గుర్తుచేశారు. మహారాష్ట్రలో బాండెడ్ లేబర్‌గా పడిన కష్టాలను ఇద్దరు మహిళలు వివరించిన ఘటనను ప్రస్తావిస్తూ, ప్రజల్లో అవగాహన పెరగడం అత్యవసరమని తెలిపారు. శ్రమదోపిడికి గురికాకుండా ఎవరు కూడా వెట్టికి గురికావొద్దని అన్నారు.. అదనపు పని చేస్తే అదనపు వేతనం ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా ఉందిని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల భద్రతపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరిస్తూ, నేను లేబర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకొచ్చామనీ తెలిపారు. 2021 నుంచి 2025 మధ్య రాష్ట్రవ్యాప్తంగా కనీసం 673 మంది బాండెడ్ కార్మికులను రక్షించి నట్లు వెల్లడించారు. చైల్డ్ లేబర్ సమస్యపై స్పందిస్తూ, చిన్నారులు మానసిక వేదనకు గురవుతారనీ తెలిపారు. పోలీసులు ఈ అంశాన్ని కేవలం లా అండ్ ఆర్డర్ సమస్యగా కాకుండా సానుభూతితో చూడాలనీ చెప్పారు మన ఇంటి పిల్లల్ని ఎలా చూస్తామో వారిని కూడా అలాగే చూడాలి" అని సూచించారు. 2025 జూలైలో నల్గొండ జిల్లాలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, కృష్ణా నది బ్యాక్‌వాటర్ ప్రాంతంలోని మత్స్యకార శిబిరంలో 29 మంది బాండెడ్ కార్మికులను, అందులో నలుగురు చిన్నారులను పోలీసులు రక్షి ంచినట్లు చెప్పారు. ఈ కేసులో ఎనిమిది మందిని



అరెస్టు చేసి, పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీస్, లేబర్, రెవెన్యూ, చైల్డ్ వెల్ఫేర్ శాఖల సమన్వయం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. బాండెడ్ లేబర్ బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# నేడు మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్

## 6వ తరగతిలో ప్రవేశాలకు 208 పరీక్షా కేంద్రాలు

### ప్రవేశపరీక్షకు 37,216 మంది దరఖాస్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో సీట్లను భర్తీ చేయడం కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్‌ను నేడు(ఆదివారం) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 208 పరీక్షా కేంద్రాలను, 7 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ కోసం నిర్వహించే పరీక్షకు 204 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు గడువు ముగిసేనాటికి 37,216 మంది దరఖాస్తు చేసుకున్నారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం 23,958 మంది, 7వ తరగతిలో ప్రవేశాలకు 5117, 8వ తరగతిలో చేరడానికి 4709 మంది, 9వ తరగతిలో చేరడానికి 2820 మంది, 10వ తరగతిలో చేరడానికి 612 మంది దరఖాస్తు చేసుకున్నారు. 6వ తరగతిలో ప్రవేశ కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనుండగా.. ఇందుకోసం 208 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షను నిర్వహించనుండగా.. అందుకోసం 204 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 10 నుంచే హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు పరీక్షకు ముందు వరకు కూడా మోడల్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.



# రాష్ట్రంలో ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి

## విమానాశ్రయ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక న్ణియాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యా చరణను సిద్దం చేసిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులతో కలిసి వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని తెలిపారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ (రక్షణ శాఖ), సివిల్ ఏవియేషన్ (పౌర విమానయాన శాఖ) , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.

# కెజిబివిల్లో జెఇఇ, నీట్‌కు ప్రత్యేక కోచింగ్

## యాదాద్రి భువనగిరి జిల్లా కెజిబివిని పర్యవేక్షించిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) జాతీయ పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్ పరీక్షలకు పాఠశాల విద్య శాఖ ప్రత్యేకంగా శిక్షణను ఇస్తున్నారు. గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో రాణించేందుకు వీలుగా, వివిధ పోటీ పరీక్షల విభాగాలలో ప్రత్యేకమైన, నాణ్యమైన కోచింగ్, విద్యాపరమైన మద్దతును అందించే లక్ష్యంతో, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 93 కేజీబీవీల్లో యంగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేసింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు హన్మకొండ జిల్లా కమలాపూర్ కేజీబీవీలో ఐఐటీ-జేఈఈ కోచింగ్‌ను 140 మందికి, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం కేజీబీవీలో 146 మందికి నీట్ కోచింగ్, రంగారెడ్డి జిల్లా కందుకూరులోని కేజీబీవీలో 82 మందికి క్లాట్ శిక్షణను ఇవ్వనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా పాలమాకులలోని కేజీబీవీలో ఎంపీసీ విభాగంలో 202 మందికి, సంగారెడ్డి జిల్లా జిన్నారం కేజీబీవీలో 202 మంది బైపీసీ విద్యార్థినులకు నల్గొండ జిల్లా మునుగోడులోని కేజీబీవీలో 150 మంది సీఈసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రత్యేక శిక్షణ నేపథ్యంలో రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ నికోలస్ యాదాద్రి జిల్లాలోని కేజీబీవీ బొమ్మలరామారంను శనివారం సందర్శించారు.

# యుఎస్‌తో చేసుకున్న ట్రేడ్ డీల్‌ను ఉపసంహరించుకోవాలి

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** అమెరికాతో మోడీ ప్రభుత్వం చేసుకున్న ట్రేడ్ డీల్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యువ జన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో పలువురు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో 'మోడీ తలవంచితే - దేశం తలవంచదు' అంటూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రైతుల కష్టాన్ని మోడీ అమెరికాకు తాకట్టుపెడితే సహించబోమని స్పష్టం చేశారు. మోడీ మహిళా బిల్లు పేరుతో మోసపూరితంగా డీలిమిటేషన్ బిల్లును పార్ల మెంట్‌లో ప్రవేశపెడితే, రాహుల్, ఖర్గేల నేతృత్వంలో బిల్లును అడ్డుకున్నారని, ఇది కేవలం బిల్లు తిరస్కరణ మాత్రమే కాదని, త్వరలో మోడీని కూడా దేశ ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. ఇప్పటికైనా మన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలకు కేంద్రం స్వస్తి పలకాలని హితవు పలికారు.

# వాట్సాప్ ద్వారా టెన్త్ విద్యార్థుల ఫలితాలు!

## హాల్‌టికెట్లను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న వారికి నేరుగా రిజల్ట్స్

### కొత్తగా ప్రవేశపెట్టిన ఎస్ఎస్‌సి బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్చిలో జరిగిన ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు తమ ఫలితాలను తెలుసుకోవడానికి ఇంటర్‌నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. విద్యార్థులు తమ రిజిస్టర్ మొబైల్ నంబర్లతో వాట్స్యాప్‌లో చూసుకునేలా ఎస్ఎస్‌సి బోర్డు ఏర్పాట్లు చేసింది.

విద్యార్థులు వారి రిజిస్టర్ మొబైల్ నంబర్లకే వాట్సాప్ ద్వారా ఫలితాలను పంపించేలా ఎస్ఎస్‌సి బోర్డు చర్యలు తీసుకుంది. ఈ సంవత్సరం నుండి ఇంటర్నెట్ మార్క్స్ మెమో కాపీని నేరుగా విద్యార్థి రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కి వాట్సాప్ ద్వారా పంప నుంది. మీ-సేవ ద్వారా 8096958096 నంబర్‌తో తమ ఎస్ఎస్‌సి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులకు ఈ సౌకర్యం నేరుగా అందుబాటులో ఉండేలా ఎస్ఎస్‌సి బోర్డు ఏర్పాట్లు చేసింది. గతంలో తమ హాల్ టికెట్లను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థులు 8096958096 నంబర్‌ను సేవ్ చేసుకొని.. చాట్‌బాట్‌ను ప్రారం భించి, వాట్సాప్ ద్వారా ఆ నంబర్‌కు హాయ్ అని సందేశం పంపి, ఆ తర్వాత ఎస్ఎస్‌సి పబ్లిక్ ఎగ్జామ్స్ ఫలితాలను ఎంచుకుని, ఓపెన్ సర్వీస్‌పై ట్యాప్ చేయాల్సి ఉంటుంది. అందులో విద్యార్థి హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసిన వెంటనే ఫలితం తక్షణమే విద్యార్థి మొబైల్ వాట్స్యాప్‌కి వస్తుంది. ఇప్పటికే ఇటువంటి విధా నాన్ని మొన్న రిలీజైన ఇంటర్ ఫలితాల్లోనూ అమ లు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తమ ఫలితాల కోసం ఇంటర్‌నెట్ సెంటర్ల చుట్టూ, మం డల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా తమ మొబైల్ ఫోన్‌లోనే ఫలితాలను చూసుకునేలా ఎస్ఎస్‌సి బోర్డు చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలను మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు 2676 కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. పరీక్షలకు 5,28,239 మంది హాజరయ్యారు. పరీక్షల ఫలితాలను మే 10. 11 తేదీల్లో విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# డీలిమిటేషన్ బిల్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

## నియంతృత్వాన్ని ప్రజాస్వామ్యం ఓడించింది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** డీలిమిటేషన్ బిల్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, నియంత్రత్వాన్ని ప్రజాస్వామ్యం ఓడించిందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హిమాయత్ నగర్‌లోని రాజ్ బహదూర్ హాల్లో సీపీఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమితి కార్యవర్గ సమావేశం జరగగా.. సమావేశానికి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. శుక్రవారం పార్ల మెంట్‌లో కేంద్ర ప్రభుత్వం మోడీ, అమిత్ షా ద్వయం నియంతృత్వంగా డీలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టడం, దాన్ని ప్రతిపక్షాలు అన్ని ఏకమై బిల్లుని ఓడించి ప్రజా స్వామ్యాన్ని కాపాడాయన్నారు. డీలిమిటేషన్ బిల్లు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా నిలుస్తోందన్నారు. ప్రజల ప్రతినిధిత్వాన్ని సమానంగా కల్పించాల్సిన ప్రక్రియను రాజకీయ లాభాల కోసం వక్రీకరించే ప్రయత్నంగా ఈ బిల్లు కనిపిస్తోందని విమ ర్శించారు. డీలిమిటేషన్ ప్రక్రియ అనేది జనాభా ఆధారంగా నియో జకవర్గాలను పునర్వ్యవస్థీక రించడం కోసం ఉండాలి, కానీ ఈ బిల్లు ద్వారా కొన్ని రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ప్రధానంగా దక్షి ణ భారత రాష్ట్రాలపై వివక్ష చూపుతూ, ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే కుట్ర అని కూనంనేని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు సమాన విలువ కలిగి ఉండాలి కానీ ఈ బిల్లు అమలు అయితే ప్రాంతాల మధ్య అసమానతలు మరింత పెరిగి, సమతుల్యత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని, సీపీఐ తరఫున తాము ఈ బిల్లును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా, పారదర్శకత లేకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం అప్రజాస్వామికమన్నారు. మహిళా బిల్లు 2023 లోనే పార్లమెంట్ ఆమోదం పొందిందని మళ్ళీ నేడు పునర్విభజన పేరుతో మహిళా బిల్లును ఉపసంహరించుకోవడం వెనుకాల బీజేపీ అసలు కుట్ర మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకోవడమేనన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తమ పార్టీగా పూర్తి మద్దతు ఉందని, స్థానిక నాయకత్వం సమ్మెలో పాల్గొని విజయవంతం చెయ్యాలన్నారు. రాబోవు రోజుల్లో పార్టీ బలోపేతం కొరకు స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారం కోసం ప్రయత్నిస్తే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో నిలబడే స్థానాలపై దృష్టి సారించి గెలిచేవిదంగా ప్రయత్నం చెయ్యాలని, దానికి రాష్ట్ర పార్టీ తరపున మద్దతు ఉంటుందని తెలిపారు.

# మహిళలను వంటింటి కుందేళ్లుగా చూసే బిజెపికి మాట్లాడే అర్హతలేదు

## రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నేత: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, ఏప్రిల్18,ప్రభాతవార్త:** మహిళలను వంటింటి కుందేళ్లుగా చూసే బిజెపికి వారి గురించి మాట్లాడే అర్హతలేదని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందదని తెలిసి కూడా పార్లమెంట్‌లో పెట్టడం కుట్ర అని ఆరోపించారు. దక్షి ణాది రాష్ట్రాల ప్రజల తరపున సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రేవంత్ విజన్ ఉన్న నాయకుడనీ, బిజెపి కుట్రలను పసిగట్టి ఛేదించడంతోపాటు దక్షి ణాది రాష్ట్రాలను అప్రమత్తం చేసిన ధీశాలి అని కొనియాడారు. ఇండియా కూటమి ఏకమై దేశాన్ని కాపాడిందని ఈ బిల్లు వీగిపోవడంతో మోదీకి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయిందని ప్రభుత్వ వీరేశం అభిప్రాయపడ్డారు. దక్షి ణాది రాష్ట్రాల ప్రజలను, పార్టీలను రేవంత్ మేల్కొలిపారని చెప్పారు డీలిమిటేషన్, మహిళా బిల్లు వేరువేరని రేవంత్ చెప్పినప్పటికి కేంద్ర ప్రభుత్వం రెండు బిల్లులు కలిపి తేవద్దని తెస్తే అవి వీగిపోతాయని రేవంత్ ముందే ప్రకటించారని గుర్తుచేశారు. మోదీ కుట్రలతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రేవంత్ హెచ్చరించడంతో తమిళనాడు ముఖ్యమంత్రితో పాటు మిగితా ముఖ్యమంత్రులు జరుగబోయే నష్టంపై అవగాహన పెంచుకొని ఆ బిల్లు పాస్‌కాకుండా చూశారని తెలిపారు.

దక్షి ణాది రాష్ట్రాలను బానిసత్వంలోకి నెట్టాలన్న మోదీ కుట్రలు భగ్నం చేయడంలో రాహుల్‌గాంధీ సఫలీకృతుడైనారనీ ప్రతిపక్షాలను ఒక జట్టు నాయకుడిగా నడిపిం చారని తెలిపారు.


బిజెపి కుట్రలను నివారిం చడంలో ఇండియా కూటమి విజయం సాధిం చిందని వీరేశం తెలిపారు. బిజెపి కుట్రలను ఛేదిం చడంలో రాహుల్ సక్సెస్ అయ్యారన్నారు. 2023 మహిళా బిల్లును అమలు పరచడానికి ఏం నొప్పి అంటూ మండిపడ్డారు.

తమిళనాడు, బెంగాల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మోదీ కుట్రలు చేశారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ కమిటీలో మహిళలను ఎందుకు తీసుకోలేరని ప్రశ్నించారు. మహిళల పట్ల చిత్తశుద్ధి లేని పార్టీ బిజెపి అన్నారు. రాజకీయ ప్రయోజనం కోసమే బిల్లు పెట్టినట్టు ప్రధాని మోదీ ఒప్పుకున్నారని అన్నారు.

# మున్నూరుకాపుల అణచివేతకు కుట్ర

## కులగణనపై ఎంపిలు, నేతల ఆగ్రహం

### జనాభా సంఖ్యను తగ్గించి చూపడంపై తీవ్రఖండన



సమావేశంలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** మున్నూరు కాపులను రాజకీయంగా, సామాజికంగా అణచి వేసేందుకు పాలకవర్గాలు కుట్రలు పన్నుతున్నాయని, ప్రభుత్వాలు విడుదల చేస్తున్న తప్పుడు గణాంకాలను తిప్పికొట్టకపోతే సమాజ ఉనికికే ప్రమాదమని వివిధ పార్టీల మున్నూరు కాపు నేతలు హెచ్చరించారు. తమ హక్కుల సాధన కోసం పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా తెలంగాణలోని మున్నూరు కాపులంతా ఏకం కావాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని వారు స్పష్టం చేశారు. మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యులు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం పలువురు కీలక నేతలతో సమావేశమయ్యారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ మాజీ ఎంపీ వి. హనుమంతరావు, టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ తదితరులను కలిసి కులపరమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కుల గణనలో మున్నూరు కాపుల సంఖ్యను కేవలం 3 శాతంగా చూపడంపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదని, మున్నూరు కాపులను సామాజికంగా దెబ్బతీసేందుకు ఉద్దేశ పూర్వకంగా చేసిన కుట్ర అని మండిపడ్డారు. వాస్తవాలను పక్కన పెట్టి, శాస్త్రీయత లేకుండా రూపొందించిన ఈ నివేదికను తీవ్రంగా ఖం డించారు. హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యా చరణను రూపొందించాలని, త్వరలోనే హైదరాబాద్‌లో సమావేశమై తదుపరి నిర్ణయా లు ప్రకటిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వం కోకాపేటలో కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఈ సమా వేశంలో నిర్ణయించారు. నిధుల సమీకరణ, సమన్వయ లోపాలను అధిగమించి, దాతలు మరియు శ్రేయోభిలాషుల సహకారంతో త్వరగా భవనాన్ని పూర్తి చేయాలని నేతలు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రైతు కనకయ్య, సభ్యులు మంగళారపు లక్ష్మణ్, పన్నాల విష్ణువర్ధన్, రమేష్ హజారి, సంఘం అధ్యక్షుడు పుటం పురుషోత్తం, రాష్ట్ర నాయకులు ఈసంపల్లి వెంకన్న, కాశటి కుమార్, ఆవుల రామారావు, మ్యూజిషియన్ సామల వేణు, వెంగళ రమేష్, మహిళా నేతలు కొణతం దీపిక, ఆకుల శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ పాలన మరిచిపోలేని గాయం

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పాలన తెలంగాణకు ఎప్పటికీ మర్చిపోలేని గాయమని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ క్రాస్ ఓటింగ్ చేసి తెలంగాణలో బిఆర్ఎస్ఎనిమిది మంది బిజెపి ఎంపిలను గెలిపించింది. తెలంగాణపై బిజెపి ఎంపి తేజస్వీ చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ను కలిసి ఫిర్యాదు చేశాం. పార్లమెంట్ దగ్గర ఆందోళన చేశాం." అని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. హరీష్ రావు చేసిన కామెంట్లకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. హరీష్ రావు రోజు ఏదో ఒకటి మాట్లాడి కాంగ్రెస్ పార్టీని, సిఎం రేవంత్ రెడ్డిని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని, సిఎం రేవంత్ రెడ్డి దక్షిణ భారత దేశ ప్రజలను ఏకం చేయడాన్ని హరీష్ రావు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. మీ నాయకుడు ఫామ్ హౌస్ లో ఉన్నారని, మీకు లోక్ సభలో ఒక్క ఎంపీ లేరని ఎంపి చామల ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌కు పిలిస్తే రేవంత్ రెడ్డి వెళ్లారని, దాన్ని హరీశ్‌రావు తప్పుపడుతున్నారని ఆవేదన చెందారు. బయ్యారంలో గ్రీస్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ఇద్దరు కేంద్ర మంత్రులకు వినతిపత్రం ఇచ్చారని, గతంలో హరీష్ రావు వేరే పార్టీల నాయకుల ఇళ్లకు వెళ్లలేదా? అని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఎప్పటికీ తామే అధికారంలో ఉంటామని వారు కలలు కన్నారని, ఆయన మామ తర్వాత తాను సిఎం అవుతా లేకపోతే తమ కుటుంబ సభ్యులు అవుతారని హరీష్ రావు భావించారని ఆయన ఆరోపించారు.

# నాన్ కమ్యునికబుల్ డిసీజ్‌లు ప్రజారోగ్యానికి పెద్ద సవాల్

## సొసైటీ ఆఫ్ ద రెనివల్ న్యూట్రిషన్ అండ్ మేటబాలిజమ్ సదస్సులో మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** నాన్ కమ్యునికబుల్ డిసీజ్‌లు ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారాయని, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల కిడ్నీలు దెబ్బతిని ఎంతో మంది రోగులుగా మారుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సొసైటీ ఆఫ్ ద రెనివల్ న్యూట్రిషన్ అండ్ మేట బాలిజమ్ వార్షిక సదస్సులో మంత్రి దామోదర్ రాజనర్సింహా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లను ఎదుర్కొనేందుకు ప్రజా ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని, వ్యాధి నివారణపై అవగాహన, ఎర్లీ స్టేజ్‌లోనే వ్యాధుల గుర్తింపు, ట్రీట్‌మెంట్, రిహాబిలిటేషన్ వరకూ సమగ్రంగా ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతి జిల్లాలో ఎన్‌సిడి క్లినిక్స్ ఏర్పాటు చేశామని, జిల్లాల్లోనే కీమో థెరపీ అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

రీజనల్ రిఫరల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలో 46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నాం, అందులో సీరమ్ క్రియాటినిన్ పరీక్ష కూడా ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలను గణనీయంగా విస్తరించామని, గత సంవత్సరం 16 కొత్త డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో మొత్తం సెంటర్ల సంఖ్య 102కు చేరిందన్నారు. ప్రతి రోగి 20 నుంచి 25 నిమిషాల్లో డయాలసిస్ కేంద్రానికి చేరుకునేలా లక్ష్యంగా పెట్టుకుని 416 బెడ్ల కెపాసిటీతో మరో 79 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జీవనదాన్ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు వేలాది అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయని, అందులో 2,700 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లు ఉన్నాయన్నారు. గతేడాది తోటా యాక్ట్‌ను అడాప్ట్ చేసుకున్నామన్నారు. దీంతో గ్రాండ్ పేరెంట్స్ కూడా కిడ్నీ దానం చేసే అవకాశాన్ని కల్పించామన్నారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను కూడా ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 6 ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నామని, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, టిమ్స్ సనత్‌నగర్‌లో అత్యాధునిక అవయవ మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సరైన ఆహార అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం ద్వారా కిడ్నీ వ్యాధులను మాత్రమే కాకుండా డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి అనారోగ్యాలను కూడా నివారించవచ్చని మంత్రి అన్నారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా డాక్టర్లు ప్రోత్సహించాలని, పబ్లిక్ హెల్త్‌లో దేశానికి తెలంగాణను రోల్ మోడల్‌గా చేసుకుందామని, ఇందుకు డాక్టర్లు సహకరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా విజ్ఞప్తి చేశారు.

# కొత్త ఆదాయపు పన్ను చట్టంపై అవగాహన

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** కొత్త ఆదాయపు పన్ను చట్టంపై అవగాహన కల్పించేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా కొత్త ఆదాయపు పన్ను చట్టంపై దృష్టి సారించే ప్రారంభ్-2026 పేరుతో ఒక అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం నిర్వహించారు. కొత్త పన్ను నిబంధనలను అర్థం చేసుకోవడం అనే అంశంపై ఈ కార్యక్రమం కేంద్రీకృతమైంది. ఆదాయపు పన్ను ఉన్నతాధికారి శివరాజ్ బి మోరే కీలకోపన్యాసం చేస్తూ, మారుతున్న పన్నుల రంగాన్ని అర్థం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సమావేశం 1961 నాటి ఆదాయపు పన్ను చట్టం నుండి 2025 నాటి కొత్త చట్టానికి మారడంలో ఉన్న ఆచరణాత్మక అంశాలపై చర్చించింది. అలాగే వృత్తి నిపుణులకు నిబంధనల పాటింపుపై ఉన్నతాధికారులు అవగాహనను కల్పించారు. హైదరాబాద్ శాఖకు చెందిన గిరిధారి లాల్ తోష్నివాల్ మరియు కుమార్ పాల్ టేటెడ్ విలువైన దృక్కోణాలను పంచుకున్నారు. కొత్త చట్టంలోని సరళీకృత నిబంధనలు మెరుగైన పన్ను సమ్మతిని ప్రోత్సహిస్తాయని, చట్టపరమైన స్పష్టతను పెంచుతాయని, మరియు పన్ను చెల్లింపుదారులకు వ్యాజ్యాలను గణనీయంగా తగ్గించడంలో సహాయపడతాయని వక్తలు నొక్కి చెప్పారు. ఈ ముఖ్యమైన శాసనపరమైన మార్పుకు స్థానిక వ్యాపారాలు మరియు ఆర్థిక నిపుణులు చక్కగా సిద్ధంగా ఉండేలా చూస్తూ, అమలు సవాళ్లను నిపుణులు ప్రస్తావించిన ఒక ఇంటరాక్టివ్ సెషన్‌తో ఈ కార్యక్రమం ముగిసింది.



## సొంతగడ్డపై సిఎస్కేను ఓడించిన

# ఆరెంజ్ ఆర్మీ

### 10 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ గర్జించింది. గత మ్యాచ్‌లో రాజస్థాన్‌పై చెలరేగిన బౌలర్లు ఈసారి పంజా విసరడంతో చెన్నై సూపర్ కింగ్స్ ను అలవోకగా ఓడించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన ఆరెంజ్ ఆర్మీ తొమ్మిది వికెట్ల నష్టానికి 194 పరుగులుచేయగా ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ 8 వికెట్ల నష్టంతో 184 పరుగులు మాత్రమే చేసింది. దీనితో సన్‌రైజర్స్ 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ(59), క్లాసెన్(59) అర్ధ శతకాలతో చెలరేగిపోయారు. ఇషాన్ మలింగ(3-29), నితీశ్ రెడ్డి(2-31)లు బౌలింగ్‌లో రాణించారు. భారీ ఛేదనలో టాపార్డర్ విఫలమైనా ఆయుశ్ మాత్రే(30), శివం దూబే(21) పోరాడినా సీఎస్కేను గెలపించలేకపోయారు. మూడో విజయంతో ప్లే ఆఫ్స్ ఆశలు నిలబెట్టుకుంది ఆరెంజ్ ఆర్మీ. భారీ ఛేదనసుధీటుగా మొదలెట్టిన చెన్నై సూపర్ కింగ్స్‌ను నితీశ్ రెడ్డి(2-31) ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఫామ్ అందుకున్న శాంసన్(7)ను ఔట్ చేసి అతడు బ్రేకివ్వగా ఇంప్యాక్ట్ సబ్ ఆయుశ్ మాత్రే(30) వస్తూనే గత మ్యాచ్ హీరో ప్రఫుల్ హింగేను ఉతికేస్తూ ఐదు ఫోర్లు రాబట్టాడు. ధాటిగా ఆడుతున్న మాత్రేను క్లాసెన్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు. వెనువెంటనే రుతురాజ్ గైక్వాడ్(19)ను ఇషాన్ మలింగ(329) వెనక్కి పంపాడు. సర్ఫ్‌రాజ్ ఖాన్(25) సైతం ఔటవ్వగా డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(0)ను ఔట్ చేసి శివాంగ్ ఐదో వికెట్ అందించాడు. మాథ్యూ షార్ట్(34) జతగా శివం దూబే(21) జట్టును గెలిపించే ప్రయత్నంచేసాడు.

## రూ.3 వేల కోట్ల రుణానికి ఇండెంట్

### 21న రిజర్వ్ బ్యాంక్‌కు సర్కార్ ప్రతిపాదన

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రుణ సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఈ నెలలో మరో రూ.3 వేల కోట్ల రుణ సమీకరణకు రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ డిపాజిట్లను తనఖా పెట్టనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపానలు పంపించింది. ఇప్పటికే ఈ నెలలో 7వ తేదీన రూ.3,900 కోట్లు రుణాన్ని తీసుకోగా, ఇప్పుడు ఇదే నెలలో ఇది రెండో సారి. ఇందులో భాగంగా ఈ నెల 21వ తేదీన రిజర్వ్ బ్యాంక్ బహిరంగ మార్కెట్లో నిర్వహించే ఈ వేలం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించనుంది. ఇందుకు గాను 7, 11, 21 ఏండ్ల కాలాలకు రూ.1000 కోట్ల చొప్పున ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టనుంది. కాగా ఈ ఆర్థిక సంవత్సంలో ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ కలిగిన తొలి క్వార్టర్‌లో రూ.18,900 కోట్లు రుణ సమీకరణ చేస్తామని రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థికశాఖ ఇండెంట్ సమర్పించింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.80,000 కోట్ల రుణ సమీకరణ చేయనున్నట్లు వార్షిక అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

## సిఎం రేవంత్‌కు రాజ్యాంగం తెలియదు

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజ్యాంగం తెలియదని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ అమలు చేసిన చట్టాలను రాష్ట్రాలు తప్పకుండా అమలు చేయాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్ చట్టాలను రాష్ట్రాలు అమలు చేయాల్సిందే అమలు చేయకపోతే రాష్ట్రపతిపాలన వచ్చే అవకాశం ఉంటుందన్నారు. 2/3 మెజారిటీతో సవరణ బిల్లు అమలు చేసిన బిల్లును రాష్ట్రాలు అమలు చేయాల్సిందే జనాభా ప్రాతిపదికన డిలిమిటేషన్ చేస్తే దక్షి ణాది రాష్ట్రాలు నష్ట పోతాయి అన్ని తెలిసి సిఎం రేవంత్ యాక్టింగ్ చేస్తున్నారు మహిళలకు వ్యతిరేకంగా ఓటేసిన కాంగ్రెస్‌ను ప్రజా క్షేత్రంలో ఎండగడుతామన్నారు. 7వ సారి కాంగ్రెస్ మహిళా బిల్లును అడ్డుకుంది దక్షి ణాది రాష్ట్రాలు సీట్లు పెంచుకునే మంచి అవకాశన్ని కోల్పోయాయని, 50 శాతం సీట్ల పెంపుతో దక్షి ణాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు వచ్చేవని అన్నారు. 2011 గానీ 2026 జనాభా లెక్కల ఆధారంగా డిలిమిటేషన్ చేస్తే దక్షి ణాది రాష్ట్రలకు తక్కువ సీట్లు

## ఎస్సీ కార్పొరేషన్ రుణాల్లో 5 శాతం కేటాయించాలి

### దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసే రుణాల్లో వికలాంగులకు 5 శాతం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డిమాండ్ చేసింది. ఎస్సీ కార్పొరేషన్ అధికారుల నిరక్ష ్యంతో స్వయం ఉపాది యూనిట్ల కేటాయింపులో వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి.వరమ్మ, రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిరుద్యోగ యువతకు 37 రకాల యూనిట్స్ స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 5 శాతం రిజర్వేషన్లను వికలాంగులకు అమలు చేయాల్సి ఉందన్నారు.

## భారత్-యుఎస్ ట్రేడ్‌డీల్‌కు వ్యతిరేకంగా జాతీయ యూత్ కాంగ్రెస్‌దీక్ష

**హైదరాబాద్ (కార్వాన్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** జాతీయ యూత్ కాంగ్రెస్ భారత్‌యూఎస్ ట్రేడ్ డీల్ కి వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి లంగర్ హౌస్ బాపూఘాట్ లో చేపట్టిన కిసాన్ న్యాయ సత్యాగ్రహ 10వ రోజు దీక్షలో ముఖ్య అతిథులుగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను చిబ్,అతిథులుగా తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి,తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి,రాష్ట్ర ఇంచార్జ్ భవ్యాజి,జిల్లా ఇన్చార్జ్ సంతోష్ గౌడ్,జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను పాల్గొని ప్రసంగిస్తూ రైతులకు జరుగుతున్న అన్యాయం పట్ల వివరిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ తరపున రైతులకు అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా అధ్యక్షునికి,రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ కి నిమ్మరసం అందించి దీక్షను విరమణ చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రవికాంత్ గౌడ్,వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కార్యవర్గ కమిటీ ఉపాధ్యక్షుడు సైనికేష్,సంజయ్,రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిలు రామకృష్ణ, ఇర్ఫాన్, కస్తూరి పవన్, కార్యదర్శి దయాగౌడ్, నియోజవర్గ ఉపాధ్యక్షులు చంద్ర యాదవ్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంతోష్ ముదిరాజ్,శ్రీనివాస్,కిరణ్,ఆదర్శ,బబ్లు ముదిరాజు, శశికాంత్ తదితర నియోజవర్గాల కార్యవర్గం కమిటీ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు అవరోధంగా వాగులు, విద్యుత్‌హైటెన్షన్ తీగలు!

### 1,500 ఎకరాలు కావాలని ఎయిర్‌ఫోర్స్ అధికారుల ప్రతిపాదన

### నిషాన్ ఘాట్ రైతుల సమ్మతితో భూసేకరణ సాధ్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** ఆదిలాబాద్ విమానశ్రయం నిర్మాణానికి జరిపిన ఆటంక పరిమితి సర్వేలో వాగులు, హైటెన్షన్ విద్యుత్ తీగలు విమా నాల టేకాఫ్ లాండింగ్ వంటి విమాన కార్యకలాపాలకు అడ్డుపడే అవకాశాలు ఉన్నట్లు ఎయిర్‌ఫోర్స్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ఎయిర్‌ఫోర్స్ కెప్టెన్లు జేపీ సభర్వాల్, హెచ్‌కె హెగ్డే, వింగ్ కమాండర్ రాజీవ్ నేతృత్వంలో పదిమంది రక్షణ, వాయు, విమాన సాధికార సంస్థ అధికారుల బృందం శుక్ర వారం ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానశ్రయంలో ఒఎల్ఎస్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన చేశారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్, పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే విమానాశ్రయం ఏర్పాటుకు 1500 ఎకరాలు అవసరమవుతాయని ఒఎల్ఎస్ సర్వే చేసిన అధికారులు నిర్ధారించారు. విమానాశ్రయానికి 820 ఎకరాలు సరిపోతాయని ఇప్పటివరకు కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం భావించాయి. ఆదిలాబాద్‌లో ఇప్పటికే రక్షణ శాఖ పరిధిలో 369.45 ఎకరాలు విమానశ్రయంకు భూమి ఉంది. దానికి అదనంగా మరో 430.30 ఎకరాలు సేకరించడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు కూడా చేపట్టంతో ఆదిలాబాద్‌లో విమానశ్రయం కావాలనే దీర్ఘకాలిక డిమాండ్ కార్యరూపం దాల్చే క్షణాలు దాదాపు సమీపించాయనీ అంతా భావించారు. రక్షణ శాఖ, పౌరవిమాన శాఖ, రాష్ట్రప్రభుత్వం ఉమ్మడిగా ప్రతిపాదిత విమానశ్రయంలో ఆటంక పరిమితిసర్వేను చేపట్టి ల్యాండింగ్,టేకాఫ్ వంటి విమాన కార్యకలాపాల భద్రత, సామర్థ్యనిర్ధారణను అధ్యయనం చేస్తారు. విమా నశ్రయం సమీపంలో భవనాలు, పర్యావరణ వంటి సున్నిత అంశాలు విమానం ఢీకొనేందుకు వీలుగా ఉన్నాయా అనే అంశంపై కూడా నిపుణులు అధ్యయనం చేశారు. అనుకుంట, బంగారుగూడ సమీపంలో రెండు వాగులు, ఆ ప్రాంతం మీదుగానే వెళ్లే హైటెన్షన్ విద్యుత్ తీగలు విమాన కార్యకలాపాలపై చూపే ప్రతికూల ప్రభావాన్ని అధికారుల బృందం విశ్లేషించి నివేదిక తయారించే అవకాశం ఉంది. వాటిని తొలగించటమా, అలాగే ఉంచటమా అనే విషయం అధికారుల బృందం ఒక స్పష్టతకు వచ్చాక ప్రభుత్వానికి సమర్పించే నివేదికలో వాటిని పొందుపరిచే అవాశం ఉంది. ఇప్పటి వరకు కేవలం 430.30 ఎకరాలు మాత్రమే సేకరణ చేయడానికి గత ఏడాది జివోనెం3 జారీచేశారు. అబస్టకల్ లిమిటేషన్ సర్వే చేసిన అధికారులు 1500 ఎకరాలు కావాల్సి ఉంటుందని ప్రాథమికంగా పెగ్‌మార్క్ చేసిన అనంతరం చెప్పడంతో మరో ఏడెనిమిది వందల ఎకరాల భూమి సేకరణ చేయాల్సిన అవసరం ఏర్పడింది. అదనపు భూమి కోసం నిషన్‌ఘాట్, అంకోలి, తంతోలి, సిసిఐ పరిశ్రమకు చెందిన భూములను ఏయిర్‌ఫోర్స్ అధికారులు పరిశీలించారు. జూన్ 2న విమానశ్రయానికి భూమిపూజ చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే ఉత్సాహపడుతున్నా వ్యవసాయభూములు వదులుకోవడానికి స్థానిక రైతులు సిద్దపడుతారా అనే అనుమానం జిల్లా యంత్రాగంలో నెలకొంది. నిషాన్ ఘాట్ సమీపంలో రైతుల సమ్మతితో భూసేకరణ చేయటం, నిర్వాసితులకు ఉద్యోగావకాశాలకు భరోసా ఇస్తే కొలిక్కివచ్చే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో చేపట్టిన ప్రాథమిక సర్వే ఒఎల్ఎస్‌కు గీటురాయిగా ఉంటుంది.

## విచారణ ముగిసేంత వరకూ సినిమాల్లో అవకాశాలొద్దు

### సింగర్ మంగ్లీపై ప్రొడ్యూసర్ కౌన్సిల్‌లో 'మా' ఫిర్యాదు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ప్రముఖ సింగర్ మంగ్లీ అలియాస్ సత్యవతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. గిరిజన బిడ్డలను మైక్రో ఫైనాన్స్ పేరుతో మోసాలు చేసినట్లు మంగ్లీపై ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై పోలీసులు విచారణ జరుపుతున్నారని, ఇది ముగిసే వరకు ఆమెకు సినిమాల్లో అవకాశం ఇవ్వద్దని తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) సభ్యులు ప్రొడ్యూసర్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఆమెకు ఇక మీదట మూవీస్‌కు కానీ, ఈవెంట్స్‌కి కానీ అనుమతి ఇవ్వద్దని శనివారం ఇచ్చిన ఫిర్యాదులో వారు కోరారు. మైక్రో ఫైనాన్స్ పేరుతో సింగర్ మంగ్లీ, ఆమె సోదరుడు మరికొంతమంది కలిసి పలువురి వద్ద కోట్లాడి రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమెపై న్యాయవాది సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ వివాదం ఇలా కొనసాగుతుండగా ఆమెను తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలనే డిమాండ్ తెరపైకి రావడం సంచలనంగా మారింది. ఈ మేరకు తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ నాయక్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రొడ్యూసర్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. నిరుపేద బాధితులను మోసం చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ఆమెను సినిమా ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేయడం గమనార్హం. ఈ క్రమంలోనే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



సదస్సులో ప్రమాణం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

## ప్రాణాన్ని రక్షిస్తే పారితోషికం, గౌరవం ఇస్తాం : మంత్రి పొన్నం

### నాగోల్ ఆర్టీఎ కార్యాలయంలో ఆరైవ్ ఆలైవ్

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని, అందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నాగోల్ ఆర్టిఏ కార్యాలయంలో ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించగా మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలు సమన్వయంతో వ్యవహరిస్తున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని, రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు రోడ్డుపైన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు మరోసారి ఉల్లంఘించకుండా ఉండదానికే పోలీసులు చాలానాలు విధిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ప్రమాదానికి గురైన వారిని గంటలోపు ఆసుపత్రిలో చేర్పిస్తే వారికి రహవీర్ పథకం కింద రూ.25వేలు ఇవ్వడంతో పాటు ప్రత్యేక గౌరవ అవార్డును కూడా ఇస్తామన్నారు. నలుగురి ప్రాణాలు కాపాడితే అంతకన్నా గొప్ప విషయం మరొకటి ఉండదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతకు సంబంధించి పాఠశాలల్లో కూడా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం నాగోల్ ఆర్టిఏ కార్యాలయంలో ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్, బెల్ట్ ధరించడం, సురక్షితంగా ప్రయాణించడం వల్లనే రోడ్డు ప్రమాదాల నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేటిసి రమేష్, ఎల్బీనగర్ డిసిపి అనురాధ, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, నాగోల్ ఆర్టిఏ అమర్‌నాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పలువురు అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# పెరిగిన రాష్ట్ర ఖజానా ఆదాయం

### సొంత పన్నుల రాబడిలో భారీ వృద్ధి

### రూ.5 వేల కోట్లు అదనంగా పెరుగుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు సొంత పనుల ఆదాయం జోరందుకుంది. ఈ ఆదాయం క్రమ క్రమంగా పెరుగుతూ వస్తోంది. వరుసగా గత రెడేళ్ల ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరిగినట్లు ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. 2024-25తో పోలిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 5 వేల కోట్ల రూపాయల మేర అదనంగా పెరిగింది. పెరిగిన పన్ను రాబడి. ఈ వృద్ధిని ఆధారంగా చేసుకుని ప్రస్తుత 2026-27 బడ్జెట్లో 20 వేల కోట్ల రూపాయల మేర అదనపు అంచనాలను ఆర్థిక శాఖ రూపొందించింది. రాష్ట్ర సొంత పన్నులతో సహా ఎస్జీఎస్టీ, సేల్స్‌టాక్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ , మోటార్వెహికిల్ టాక్స్ పన్నులకు సంబంధించిన నివేదికను వెల్లడించింది. ఈ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం గత ఆర్థిక సంవత్సరం కంటే మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో పెరిగిందని వివరాలను వెల్లడిస్తున్నాయి.

ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో మొదటి మూడు క్వార్టర్లో విభాగాల వారిగా ఆదాయాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. రాష్ట్ర స్వంత పన్నుల ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో రూ.28,734 కోట్లు కాగా, రెండో క్వార్టర్‌లో రూ.28,698 కోట్లు, చివరి మూడో క్వార్టర్‌లో రూ.28,698 కోట్లు రాగా, సేల్స్ టాక్స్ ఈ మూడు క్వార్టర్లకు వరుసగా, రూ.8,203 కోట్లు, రూ.7,879 కోట్లు, రూ.7,953 కోట్లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు రూ.3,449 కోట్లు, రూ.3,802 కోట్లు, రూ.3,320 కోట్లు, ఎస్జీఎస్టీ రూ.10,297 కోట్లు, రూ.10,516 కోట్లు, రూ.10,695 కోట్లు, ఎక్సైజ్ టాక్స్ రూ.4,786 కోట్లు, రూ.4,707 కోట్లు, రూ.4,585 కోట్లు, రవాణా పన్నులు రూ.1,773 కోట్లు, రూ.1,601 కోట్లు, రూ.1,929 కోట్లు మేర ఖజానాకు చేరాయి.

అదే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం మూడు క్వార్టర్లకు వరుసగా రూ.28,862 కోట్లు, రూ.29,717 కోట్లు, రూ.33,618 కోట్లు, సేల్స్ టాక్స్ ద్వారా రూ.8,467 కోట్లు, రూ.8,259 కోట్లు, రూ. 88,401 కోట్లు, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్లు నుండి రూ. 3,712 కోట్లు, రూ.3,705 కోట్లు, రూ. 3,887 కోట్లు, ఎస్‌జీఎస్టీ ద్వారా రూ.10,135 కోట్లు, రూ.10,924 కోట్లు, రూ.11,106 కోట్లు, ఎక్సైజ్ పన్నుల కింద రూ.4,595 కోట్లు, రూ.5,025 కోట్లు, రూ.7,836 కోట్లు, మోటార్ వెహికల్ పన్నుల కింద రూ.1,657 కోట్లు, రూ.1,545 కోట్లు, రూ.2,086 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేరాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని 2026-27 ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే అధికంగా ఉంటుందనే అంచనాతోనే 2025-26 వార్షిక బడ్జెట్ కంటే రూ.20 వేల కోట్ల అంచనాలను పెంచి ఆర్థిక శాఖ ప్రతిపాదించింది.

## మహిళా రిజర్వేషన్ చట్టంలో సవరణలు వీగిపోవడం దురదృష్టకరం

### కాంగ్రెస్, మిత్రపక్షాలది చారిత్రక తప్పిదం

### మహిళా బిల్లును ఏడుసార్లు అడ్డుకున్న కాంగ్రెస్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఎంతో ఎదురుచూస్తున్న నియోజక వర్గాల పునర్విభజన చట్టం, మహిళారిజర్వేషన్ చట్టంలో సవరణలు పార్లమెంటులో వీగిపోవడం దురదృష్టకరం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ బిల్లులను అడ్డుకోవడం కాంగ్రెస్, వారి మిత్రపక్షాలు చేసిన చారిత్రక తప్పిదమని, ఈ పార్టీలు మహిళాద్రోహులుగా నిలిచిపోతాయన్నారు. అసలు బిల్లును ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు చెప్పలేకపోయారని, బిల్లుపెట్టకముందు దక్షి ణాదికి అన్యాయం అన్నారు. బిల్లు పెట్టిన తర్వాత ఎంపి, అసెంబ్లీ స్థానాలను పెంచుకునే విధంగా కుట్ర అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 50శాతం సీట్లు పెంచుకోవాలనే విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పిందని, ప్రధానమంత్రి స్వయంగా అన్ని భాషల్లోని పత్రికల్లో దేశ ప్రజలకు వివరించారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశంలోనూ వివరించారన్నారు. అందరి సహకారం ఉంటుందనే ఆకాంక్షతో ఈ బిల్లును ప్రవేశపెడితే.. కాంగ్రెస్, మిత్రపక్షాలు మరోసారి కుట్రచేసి ఈ బిల్లును, డీలిమిటేషన్ బిల్లును అడ్డుకున్నారు. ఇలా కాంగ్రెస్ చరిత్రలో మహిళాబిల్లును అడ్డుకోవడం మొదటిసారి కాదు, రెండు నాల్కల ధోరణితో మహిళలను రాజకీయంగా చైతన్యం చేసే కార్యక్రమంలో మహిళలను లబ్ధి చేకూర్చే బిల్లును వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారన్నారు. మొత్తంగా 7 సార్లు ఈ బిల్లును కాంగ్రెస్, వారి మిత్రపక్షాలు అడ్డుకున్నాయి... 1996లో దేవేగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు, ఆతర్వాత 98, 99, 2002లో వాజ్ పేయి ప్రధానిగా ఉన్నప్పుడు అడ్డుకున్నారు. బిల్లు పేపర్లను చించి స్పీకర్ మీద, ప్రధానమంత్రి మీద వేశారు. 2008-10లో మన్మోహన్ ప్రభుత్వం బిల్లు పెడితే.. సమాజ్ వాద్ పార్టీ, ఆర్జేడీ పార్టీలను ప్రోత్సహించి బిల్లును అడ్డుకునేలా చేశారని, నాడు.. కాంగ్రెస్ మిత్రపక్షాలు మేం గిల్లినట్లు చేస్తాం, మీరు ఏడ్చినట్లు చేయండన్నట్లుగా కాంగ్రెస్‌తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించాయన్నారు శుక్రవారం సైతం అదే తరహాలో అన్నీ కలిసి మహిళాబిల్లును అడ్డుకున్నాయని, దక్షి ణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ దాని మిత్రపక్షాల పార్టీలు కలిసి చెన్నైలో సమావేశం పెట్టారు. ఇప్పుడేమో ఇలాంటి అర్థంలేని విమర్శలు చేస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం దక్షి ణాది రాష్ట్రాలకు మేలు జరిగేలా ప్రయత్నిస్తే, ఈ బంగారు అవకాశాన్ని అడ్డుకున్నారు... ఇది కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకమైన తప్పిదం. దక్షి ణాది రాష్ట్రాలకు దురదృష్టకరం... మోడీ మీద ద్వేషాన్ని, బిజెపిపై ద్వేషాన్ని.. దేశంలోని మహిళలమీద, దక్షిణాది మీద చూపించారన్నారు. వరుసగా మూడు ఎన్నికల్లో ఓడిపోయామన్న బాధలో, అనేక రాష్ట్రాల్లో 100 సార్లు ఎన్నికల్లో ఓడిపోయామన్న నిరాశ, నిస్పృహలతో ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. వారంతా కలిసి దక్షి ణాది ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. రాజకీయ పరమైన ద్వేషంతో దక్షి ణాదికి నష్టం చేశారు, రేవంత్ రెడ్డి, కెసిఆర్ తెలంగాణకు జరిగే లాభాన్ని, వారు కూడా అడ్డుకున్నారని, రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళామణులకు, చట్టసభల్లోకి వచ్చి దేశానికి, సమాజానికి మేలుచేయాలనుకున్న మహిళలకు, అనేక రాజకీయ పార్టీల్లో అవకాశాలు రాని వారందరి ఆశలమీద నీళ్లు చల్లారంటూ మండిపడ్డారు. అనేకమంది బడుగు బలహీన వర్గాలనుంచి వచ్చిన వారికి, విద్యావంతులకు, మహిళలకు మోసం చేశారని, రాహుల్ గాంధీ అవలంబిస్తున్న విధానం, ఆయన చేస్తున్నటువంటి ప్రకటనలు, పూర్తిగా దేశ వ్యతిరేకంగా ఉన్నాయని, రోజు రోజుకూ నిరాశ, నిస్పృహలతో కుంగిపోతున్నటువంటి రాహుల్ గాంధీ నుంచి ఇంతకంటే గొప్పగా దేశ ప్రజలు ఏమీ ఆశించకూడదని మరోసారి నిరూపితమైందన్నారు.

## డీలిమిటేషన్‌పై దక్షిణాది ప్రాంతాలు ఏకతాటిపైకి రావాలి

### పలు పార్టీల నాయకులు పిలుపు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** సమాజం కోసం దక్షిణాది రాష్ట్రాల నాయకులు, ప్రజలు ఐక్యంగా ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని బిజెపి కుట్రలను ఎదుర్కొనాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్‌లపై బిజెపికి చిత్తశుద్ధి లేదని, తాను బలంగా ఉన్న ప్రాంతాలలో మరింతగా బలం పెంచుకుని తిరిగి అధికారం చేజిక్కించుకోవడానికి రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నదని వారు ఆరోపించారు. తెలంగాణ సమైక్య, అఖిల పక్ష పార్టీలు-ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డిలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు మరణశాసనం విధిస్తున్న 131 సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'ఆత్మగౌరవ సభ'లో వక్తలు ప్రసంగించారు. ఆధిపత్యం కోసం ఆర్యులు దక్షిణ భారతదేశ ప్రాంతాన్ని అణిచివేసేందుకు కుట్రపన్నుతున్నారని రాష్ట్ర శాసన మండలిలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆరోపించారు. దీన్ని ఎదుర్కొనే ందుకు, హక్కుల పరిరక్షణ కోసం దక్షిణ ప్రాంత ప్రజలు ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమానత్వం చూడకుండా కుట్రపూరితంగా డిలిమిటేషన్ బిల్లు, మహిళా బిల్లును తీసుకువచ్చిందని ఆయన ఆరోపించారు. 2027 జనాభా లెక్కల ప్రాతిపదికన, వెనకబడ్డ ప్రాతిపదికన డిలిమిటేషన్ చేయకుండా 2011 జనాభా ప్రాతిపదికన డిలిమిటేషన్ చేయడం దారుణమన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయన్న భయంతోనే బిజెపి భయపడుతున్నదని, ఒక ప్రాంతానికి మరొక ప్రాంతం ప్రాతినిధ్యం వహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బిజెపి బానిసల పార్టీ అని, ఆర్యుల ఆధిపత్యాన్ని అణిచివేయాలని సూచించారు. తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ 131 రాజ్యాంగ సవరణ బిల్లు విగిపోవడం సంతోషకరమన్నారు. రాజకీయ ఆధిపత్యం సాధించడం కోసం, శాశ్వతమైన అధికారం కోసం తెచ్చినదే ఈ బిల్లు అని ఆయన ఆరోపించారు. ప్రజలంతా ఐక్యతను కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యం ఐక్యంగా కొనసాగాలన్నారు.

## దక్షిణాది గళాన్ని అణచివేస్తున్న తీరుపై నిరసన

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షి ణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షి ణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షి ణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై తాము తీవ్ర ఆందోళన, నిరసనను వ్యక్తం చేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షి ణ భారతదేశానికి ప్రస్తుతం 24శాతం స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## ఎపి డి.సిఎం పవన్‌కు శస్త్రచికిత్స

**విజయవాడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి శని వారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. శుక్రవారం ఉదయం తన అధికారులతో పాలనా పరమైన విషయాలపై చర్చిస్తున్న సందర్భంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా పవన్ కల్యాణ్ ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయన వ్యక్తిగత వైద్యుల సలహాతో శుక్రవారం అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలతో పాటు ఎం.ఆర్.ఐ. కూడా నిర్వహించారు. వాటిని పరిశీలించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయవలసి ఉంటుందని నిర్ణయించి, శస్త్రచికిత్స చేశారు. వారం నుంచి పది రోజులపాటు విశ్రాంతి తర్వాత ఆయన అధికారిక పాల్గొనవచ్చని డాక్టర్లు తెలిపారు. అయితే దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందని, పూర్తి స్వస్థత చేకూరడానికి ఎక్కువ కాలం పడుతుందని డాక్టర్లు చెప్పారు.



